క్లుప్తంగా

ఎన్టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్



ఆధార్ కార్డులు, వాహన రికార్డులు పరిశీలిస్తున్న ఎస్సై రాము

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో టెక్కలి పోలీసులు శనివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై కె.రాము ఆధ్వర్యంలో సుమారు పది మంది సిబ్బందితో కాలనీలోని 3వ, 4వ లైన్లలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దీనిలో భాగంగా రికార్డులు లేని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వీధుల్లో అనుమానిత వ్యక్తుల సంచారం, నిషేధిత పదార్థాల వినియోగం, అమ్మకం వంటి వాటిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనుమానిత వ్యక్తుల ఆధార్ కార్డులను పరిశీలించారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి కిశోర్ బాబు

మందస: సామాన్యులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు దోహదపడతాయని సోంపేట కోర్టు అదనపు జిల్లా జడ్జి కె.కిశోర్‌బాబు అన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మందస మండలం పెట్టువ గిరిజన గ్రామంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చదువు ద్వారానే విజ్ఞానం లభిస్తోందన్నారు. సీనియర్ న్యాయవాది మడ్డు సర్వేశ్వరావు మాట్లాడుతూ.. కులవివక్ష, అంటరానితనం ఏమైనా ఉంటే పోలీసులను ఆశ్రయించడం ద్వారా న్యాయం జరుగుతుంది. న్యాయవాదులు వై.కృష్ణ మోహన్, ఎంసీహెచ్ శ్రీనివాస్, కె.రాజు, జగదీష్ పండా పాల్గొన్నారు.

మాజీ మంత్రి అప్పలరాజుకు కంచిలి నేతల మద్దతు



మాజీ మంత్రి అప్పలరాజును దుశ్శాలువతో సత్కరిస్తున్న నాయకులు

కంచిలి: వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం వేధింపు చర్యలకు పాల్పడడాన్ని కంచిలి మండల నేతలు ఖండించారు. ఈ మేరకు కాశీబుగ్గలోని ఆయన నివాసంలో శనివారం కలిసి అప్పలరాజు చేపడుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతును తెలుపుతూ దుశ్శాలువతో సత్కరించారు. మాజీమంత్రిని కలిసిన వారిలో కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఉపాధ్యక్షుడు తలగాన తిరుపతిరావు, మండల ఏఎంసీ మాజీ అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మడ్డు వెంకటరావు, యువజన విభాగం అధ్యక్షుడు మడ్డు అభి యాదవ్, బొట్టా చిన్నారావు ఉన్నారు.

తీరప్రాంత అభివృద్ధిపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ రమేష్‌కుమార్

కవిటి: తీరప్రాంత గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమపథకాలు, ప్రోత్సాహకాలపై అందరికీ సమగ్ర అవగాహన అవసరమని మెరైన్ సీఐ రమేష్‌కుమార్ అన్నారు. సీహెచ్ కపాసుకుద్దిలో స్థానిక మత్స్యకారులతో కలిసి అవగాహన సదస్సును కోస్టల్ సెక్యూరిటీ బారువ మెరైన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భద్రత సంక్షేమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెరైన్ పోలీస్‌స్టేషన్ అధికారులు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, దత్తత కానిస్టేబుల్ శాంతమూర్తి, పంచాయతీ కార్యదర్శి మన్మథరావు, గ్రామ రెవెన్యూ అధికారిణి పార్వతి, స్థానిక సర్పంచ్ కాయ దమయంతి పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షునిగా చంద్రశేఖరరావు

నందిగాం: తెంబూరు పీఏసీఎస్ అధ్యక్షునిగా పోలాకి చంద్రశేఖరరావు నియమితులయ్యారు. ఈ మేరకు టెక్కలి కో-ఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సభ్యులుగా బెండి జగదీష్‌చంద్రగిరి, మద్దిల అనంతయ్యలు నియమితులయ్యారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చంద్రశేఖరరావు అన్నారు.

పడకేసిన వైద్యం!

- కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- అవస్థల్లో రోగులు



రోగులు రాక బోసిపోయిన కొళిగాం పీహెచ్‌సీ

ఇచ్ఛాపురం రూరల్: పల్లెల్లో వైద్యం పడకేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండే వైద్యులు సమ్మె బాట పట్టడంతో ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యాయి. తమ సమస్యలు పరిష్కారం, డిమాండ్లు నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తోందంటూ వైద్యులు సమ్మెకు దిగడంతో గ్రామీణులకు వైద్య సేవలు అందడం లేదు. దీంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులు, సంచి వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

సెప్టెంబర్ 28 నుంచి..

డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా పీహెచ్‌సీల వైద్యులు సెప్టెంబర్ 28వ తేదీ నుంచి నిరసన బాట పట్టారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి విధులకు దూరమై చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పటి నుంచి వైద్యుల్లేక పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్యులు లేరని తెలియడంతో వారంతా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు.

జోరుగా సీజనల్ వ్యాధులు

కొద్ది రోజుల క్రితం వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రారంభమయ్యాయి. ఇచ్ఛాపురం మండలంలో 21 పంచాయతీలకు కొళిగాం, ఈదుపురం, అర్బన్ పురుషోత్తపురం గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉండగా, కవిటి మండలంలో 23 పంచాయతీలకు బొరివంక, మాణిక్యపురం, బెలగాం, 31 పంచాయతీలు ఉన్న కంచిలి మండలంలో ఎం.ఎస్.పల్లి, కంచిలి గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉండగా, సోంపేట మండలంలో 23 పంచాయతీలకు బారువ, బట్టిగళ్లూరు, కొర్లాం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. సంబంధిత ఆస్పత్రుల్లో వైద్యులు ఉంటే రోజుకు 70 నుంచి 100 వరకు ఓపీలు వస్తాయని, ప్రస్తుతం రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో వైద్యం కష్టమవుతుందని సిబ్బంది చెబుతున్నారు.

నిలిచిన 104 వాహన సేవలు

షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి వైద్యం అందించాల్సిన 104 వాహన సేవలు సైతం వైద్యులు లేకపోవడంతో నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ వాహనాలు ఆయా పీహెచ్‌పీల వద్దే ఖాళీగా ఉంటున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు, గర్భిణులు, బాలింతలు వైద్యం అందక అవస్థలు పడుతున్నారు.



వైద్యుల సమ్మెతో ఖాళీగా దర్శనమిస్తున్న ఈదుపురం పీహెచ్‌సీలోని వైద్యుల కుర్చీ

అరకొర వైద్య సేవలే..



రెండు రోజుల క్రితం ఆరోగ్యం బాగోలేక మా గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాము. అక్కడ వైద్య సిబ్బంది అరకొరగానే వైద్యం అందించారు. వైద్యులు సమ్మె చేస్తున్నారన్న విషయం అప్పుడు మాకు తెలిసింది. పూర్తి స్థాయి చికిత్స కోసం ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వచ్చింది.

– అప్పన్న బెహరా, సుకంతి బెహరా, కొళిగాం, ఇచ్ఛాపురం మండలం

104 వాహనం రావడం లేదు



కొన్ని రోజుల నుంచి మా గ్రామాలకు 104 వాహనం రావడం లేదు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 104 బండి వస్తే చాలు అన్ని వైద్య సేవలు, రక్త పరీక్షలు చేసేవారు. ఇప్పుడు ప్రైవేటు ఆస్పత్రులకు, సంచి డాక్టర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. చాలా మంది బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులు ఉన్నారు. మాలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని 104 వాహనం సేవలు అందించాలి.

– బుద్దాల ఋషికేశ్, బిర్లంగి, ఇచ్ఛాపురం మండలం

గతమెంతో ఘనం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేవి. నాడు–నేడు పేరుతో పీహెచ్‌సీలను అభివృద్ధి చేసి, ఏరియా ఆస్పత్రిలో ఏ విధంగా అయితే వైద్య సేవలు అందుతాయో ఆ విధంగా తయారు చేశారు. అలాగే ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ వెల్ నెస్ సెంటర్ నిర్మించారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించి గ్రామాల్లో ప్రతీ నెల డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి రోగులకు ఉచితంగా మందులు అందజేసేవారు. ఇప్పుడు వైద్యం పడకేయడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

వరికి సుడిదోమ!

- రైతుల ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



కోటబొమ్మాళిలో వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

టెక్కలి: వరిపంటను సాగు చేస్తున్న రైతులకు సుడిదోమ భయం పట్టుకుంది. ఉష్ణోగ్రతలు ఎక్కువైతే సాంబ, సంపద స్వర్ణ, సాంబ మసూరికి సుడిదోమ ఆశించే అవకాశం ఉంది. అయితే రైతులు అప్రమత్తంగా ఉంటే ఎటువంటి భయాందోళన అవసరం లేదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. టెక్కలి నియోజకవర్గంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో సాంబ, సంపద స్వర్ణ, సాంబ మసూరి తదితర రకాల సాగు చేస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో సుడిదోమ ఆశించే అవకాశం ఉండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

సుడిదోమ లక్షణాలు ఇవే..

సుడిదోమ ఆశించడం వలన పైరు పూర్తిగా సహజత్వాన్ని కోల్పోతాయి. దుబ్బు అడుగు భాగంలో ఆకుల తొడిమల నుంచి రసాన్ని పీల్చివేయడంతో మొక్కలు ఎండిపోతాయి. వరి చిరుపొట్ట దశలో అధికంగా సుడిదోమలు ఆశిస్తాయి. అంతే కాకుండా వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగితే ఈ దోమలు మరింత వ్యాప్తి చెందుతాయి. పైరు పూర్తిగా ఎరుపు రంగుగా మారి ఎండిపోతాయి. అవసరమైన దాని కంటే అధికంగా నత్రజని ఎరువులు వాడడం, దగ్గరగా నాట్లు వేసుకోవడం సుడిదోమ వ్యాప్తికి మరింత దగ్గరవుతాయి.

సుడిదోమ ఆశిస్తే..

సుడిదోమ ఆశించినప్పుడు కొన్ని రకాల సేద్యమైన పద్ధతులు పాటించాలి. పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలి. పొలాన్ని ఆరబెట్టాలి. గాలి, వెలుతురు తగిలే విధంగా బాటలు వేసుకోవాలి. సహజ శత్రువైన సాలిడ్లు, అక్షింతల పురుగులు ఉండే విధంగా చూసుకోవాలి. దీపపు కాంతి ఎరలను ఏర్పాటు చేసుకోవాలి.

నివారణ పద్ధతులు ఇలా..

సుడిదోమ ఆశించిన క్రమంలో కొన్ని రకాల రసాయన పద్ధతులు పాటిస్తే ఎంతోమేలు. వేప నూనెతో పాటు బుప్రోఫెజిన్, పైమిట్రోజెన్, ఇమిడాక్లోప్రిడ్, డైనోటిప్యూరాన్, మోనోక్రోటోఫాస్ రసాయన మందులను వ్యవసాయాధికారుల సలహాలతో పిచికారీ చేయాలి.

ఎటువంటి ఇబ్బందుల్లేవు..



టెక్కలి నియోజకవర్గంలో వరి పంటకు ప్రస్తుతానికి ఎటువంటి సుడిదోమ ఇబ్బందులు లేవు. ఇటీవల వ్యవసాయ శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించాం. ఎక్కడా తెగుళ్ల బెడద లేదు. అయితే రైతులు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడైనా సుడిదోమ, ఇతర తెగుళ్ల కనిపిస్తే తక్షణమే వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలి.

–కె.జగన్మోహన్‌రావు, వ్యవసాయ శాఖ ఏడీ, టెక్కలి

రైతు బజారు కోసం సంతకాల సేకరణ

పలాస: పలాస కేంద్రంగా రైతు బజారు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. నాయకులు తెప్పల అజయ్‌కుమార్, వి.కృష్ణారావులు మాట్లాడుతూ.. రైతు బజార్ ఏర్పాటు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికన్నారు. నాయకులు తెప్పల రాజు, ఎం.పరుశరాంపాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

సోలార్‌తో విద్యుత్ ఆదా

ఇచ్ఛాపురం రూరల్: సోలార్ వినియోగంతో విద్యుత్‌ను ఆదా చేయవచ్చని పలాస విద్యుత్ శాఖ డిప్యూటీ ఈఈ ఎం.నిరంజన్‌బాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోలార్ వాడకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జీఎస్టీ రేట్లను సవరించడంతో సోలార్ ధరలు కూడా తగ్గాయన్నారు. ఎంపీడీవో ప్రభాకరరావు, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి ఏఈలు గోవిందరావు, రామారావు, గురవయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఈ నిరంజన్‌బాబు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వజ్రపుకొత్తూరు రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.సత్యన్నారాయణ అన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో శనివారం మొక్కలను నాటారు. స్వచ్ఛ గాలి..కాలుష్య నివారణపై అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. అక్కుపల్లి శివసాగర్ తీరాన్ని సందర్శించారు. ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు హేమారావు, పీఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు పైల గణేంద్ర, కె.శ్రీనివాసరావు, పైల చక్రధర్, ఉపేంద్ర ఉన్నారు.



మొక్క నాటుతున్న జెడ్పీ సీఈవో సత్యన్నారాయణ

రాష్ట్రస్థాయి పోటీలకు ఈదుపురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: పల్నాడు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి గేమ్స్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని ఈదుపురం కంద్రావార్డు ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు కృష్ణదాస్ (అండర్–17 త్రో బాల్), సోమేష్ బెహరా(అండర్–17 స్విమ్మింగ్), మహాలక్ష్మీ బెహరా(అండర్–14 స్విమ్మింగ్)లను ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా తిరిగి రావాలని అభిలాషించారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయించొద్దు

కంచిలి: ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపట్టొద్దని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలో దీపావళి సందర్భంగా అనుమతి లేకుండా అమ్మకాలు జరిపినట్‌లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలలో ముందస్తు దీపావళి



నరకాసురుని వధ సన్నివేశం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం: సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

ఇచ్ఛాపురం రూరల్: బలరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు దీపావళి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు యశోద మాట్లాడుతూ.. చెడుపై మంచికి సంకేతంగా జరుపుకునే హిందువుల పండుగని అన్నారు. విద్యార్థులు సత్యభామ, నరకాసురుడు వేషధారణలో అలరించారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని పంజావీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు దీపావళి సంబరాలు జరిగాయి. చిన్నారులు సంప్రదాయ వస్త్ర అలంకరణలో ఆలరించారు.

పాఠశాలకు ఎల్ఈడీ టీవీ వితరణ

కంచిలి: బూరగాం మోడల్ ప్రైమరీ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన జడ్డిడి అప్పారావు, కవిత దంపతులు రూ. 10 వేలు విలువ చేసే ఎల్ఈడీ టీవీని వితరణగా ఇచ్చారు. దీన్ని హెచ్ఎం బల్ల కాంతారావుకు శనివారం అందజేశారు. దాత అప్పారావు ఒడిశా రాష్ట్రంలో హైస్కూల్ హెచ్ఎంగా పనిచేస్తున్నారు.



టీవీని అందజేస్తున్న దాతలు

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

వజ్రపుకొత్తూరు: గ్రామాల్లో పచ్చదనం–పారిశుద్ధ్యం మెరుగుకు ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈవో డి.సత్యన్నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు, ఈఓపీఆర్డీ డి.తిరుమలరావుతో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్రపై సమీక్షించారు. రికార్డులను పరిశీలించిన ఆయన ఉపాధి పనుల ప్రణాళికలు, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం డోకులపాడు సముద్ర తీరాన్ని పరిశీలించారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యన్నారాయణ

స్ఫూర్తి సేవా సంస్థ ఆదర్శం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి– గోవిందపురం గ్రామానికి చెందిన పాలిన బుడ్డెమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. నిరుపేద కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక స్ఫూర్తి సేవా సంస్థ ప్రతినిధులు అండగా నిలిచారు. 21 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో బాధితురాలికి శనివారం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కెంగువ రాంబాబు, బి.మన్మధరావు, ఉత్తరాల బాలరాజు, శరత్ మాస్టార్, అర్జి



చెక్కును బుడ్డెమ్మకు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచాలి

పలాస: గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచాలని.. అందుకు తగిన చర్యలు ప్రజలు చేపట్టి సహకరించాలని పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెప్పారు. ప్రతి శనివారం చేపడుతున్న స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీలోని అన్ని సచివాలయాల పరిధిలో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ఈనెలలో ప్రాధాన అంశమైన క్లీన్ ఎయిర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించారు. మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఆదిత్య విద్యార్థులు ఎంపిక

టెక్కలి:

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రముఖ సాఫ్‌వేర్ సంస్థ ఎన్‌డిమాట్రిక్స్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వర్రావు శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా కళాశాలకు చెందిన పది మంది ఏడాదికి ఏడు లక్షల రూపాయల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ డీన్ ఎం.సంతోష్‌కుమార్, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ హెడ్ ఎస్.శ్రీకాంత్‌తో పాటు అన్ని విభాగాల హెచ్‌ఓడీలు విద్యార్థులను అభినందించారు.

ప్రైవేట్ వద్దు.. సర్కార్ వైద్యమే ముద్దు..



వజ్రపుకొత్తూరు: దేవునల్తాడలో రచ్చబండ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలిన శ్రీనివాసరావు తదితరులు



సోంపేట: టి.శాసనాంలో కోటి సంతకాల సేకరణలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ నిమ్మన దాస్



మందస: బహడపల్లి రచ్చబండలో మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకీరెడ్డి తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురంలో సంతకాల సేకరణలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ బోర పుష్ప తదితరులు



టెక్కలి: కోటబొమ్మాళి మండలం కన్నేవలసలో రచ్చబండ నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు



పలాస: మొగిలిపాడులో రచ్చబండ నిర్వహిస్తున్న మాజీమంత్రి సీదిరి అప్పలరాజు



పలాస: అమలకుడియా రచ్చబండలో పలాస మండల నాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలనే ఆలోచనను కూటమి సర్కార్ విరమించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనే ఆలోచనను వ్యతిరేకిస్తూ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ–రచ్చబండ కార్యక్రమాలను పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు సక్రమంగా అందవనే విషయాన్ని అందరూ గమనించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటానికి అందరూ మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు.

–సాక్షి నెట్‌వర్క్

భక్తిశ్రద్ధలతో ధన్వంతరి జయంతి

టెక్కలి: కోటబొమ్మాళిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ధన్వంతరి జయంతి కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.నాగరాజు ఆధ్వర్యంలో ధన్వంతరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సీహెచ్.సుశీల, లక్ష్మి, శోభారాణి, శ్రీనివాస్ ఉన్నారు.